
సాక్షి
ఆదిలాబాద్
బుధవారం। 10। మే। 2023

పరీక్ష ఫలితమే.. జీవితం కాదు



జీవితం అంటే చదువులు, మార్కులు, ర్యాంకులు, ఉన్నత ఉద్యోగాలు మాత్రమే కాదు. ఇవన్నీ విజయానికి కొలమానాలు కానేకాదు. పరీక్ష తప్పితే ఓడిపోయినట్లు కాదు. 8లో▸



ఆర్టీసీకి సీజన్ జోష్

శుభకార్యాల సీజన్ కావడంతో ఆర్టీసీకి కలిసివస్తోంది. బస్సుల్లో వారం రోజులుగా ప్రయాణికుల శాతం ఆక్యుపెన్సి రేషియో (ఓఆర్) పెరిగింది. 10లో▸

గరిష్టం/కనిష్టం
41.5/27.6

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమౌతుంది. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వేడి, ఉక్కపోత పెరుగుతుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు, రేపు మామోగ్రఫీ స్క్రీనింగ్ పరీక్ష

ఆదిలాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో రొమ్ము, బ్రెస్ట్ కాన్సర్ వ్యాధిని నిర్ధారించేందుకు ఈ నెల 10, 11 తేదీల్లో మామోగ్రఫీ స్క్రీనింగ్ పరీక్ష నిర్వహించనున్నట్లు డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రొమ్ము, బ్రెస్ట్ సంబంధిత ఆరోగ్య సమస్యలు ఉన్న మహిళలు, 45 ఏళ్లకు పైబడిన పట్టణంతో పాటు పరిసర ప్రాంత మహిళలు శిబిరానికి హాజరుకావాలని సూచించారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నటరాజ్

ఆదిలాబాద్‌రూరల్: మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల పాఠశాలలో 6, 7, 8 తరగతుల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం బుధవారం నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు అన్నిఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ నటరాజ్ అన్నారు. మంగళవారం ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాలల ఆర్‌సీవో సమావేశ మందిరంలో ఆర్‌సీవో, జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి, డీఈవో, సీఎస్‌లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1,300 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, వీరి కోసం జిల్లా కేంద్రంలో 6 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో ఆర్‌సీవో గోపీచంద్, జిల్లా బీసీ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, డీఈవో ప్రణీత, డీసీవో అంజలి, సీఎస్‌లు, డీవోలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో 'ఉపాధి' నిర్వీర్యం



మాట్లాడుతున్న సుహాసినిరెడ్డి

ఆదిలాబాద్: ఉపాధి హామీ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని బీజేపీ రాష్ట్ర నాయకురాలు చిట్యాల సుహాసినిరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆమె నివాసంలో మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు 100 రోజుల పనిదినాలు కల్పించాలనే సదుద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకం జిల్లాలో సరిగా అమలు కావడంలేదన్నారు. కూలీలు పనికి వెళ్లినప్పటికీ కూలి అందడం లేదన్నారు. సమస్యపై కలెక్టర్ దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున నిరసనలు తెలుపుతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు ఘటిక క్రాంతి కుమార్, గందె విజయ్, గన్నోజి విజయ్, కొత్తపల్లి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

డీడబ్ల్యూఏ జిల్లా కార్యవర్గం ఎన్నిక

కైలాస్‌నగర్: డిజెబులిటీ వెల్ఫేర్ అసోసియేషన్ (డీడబ్ల్యూఏ) జిల్లా కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కులో నిర్వహించిన సమావేశంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా బి.రామయ్య, ముఖ్యసలహాదారుడిగా మహేందర్‌రెడ్డి, అధ్యక్షుడిగా ప్రమోద్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా ముత్యాల సురేష్, ఉపాధ్యక్షులుగా అశోక్, నగేష్, నారాయణ, శ్రీనివాస్, రమేష్, దీపక్, చంద్రశేఖర్, జాయింట్ సెక్రెటరీలుగా హనుమంతు, పోచన్న, ఆర్గనైజర్లుగా ప్రవీణ్, సంతోష్, కోశాధికారిగా లక్ష్మారెడ్డి, గణేశ్, కార్యవర్గ సభ్యులుగా గేడం రమేష్, వెంకటి, శివకుమార్, అనసూయ, ఆశ, సునీత, అశోక్, వినోద్‌లను ఎన్నుకున్నారు.

రేషన్ దుకాణాలు తనిఖీ



తనిఖీ చేస్తున్న డీఎస్‌వో కిరణ్‌కుమార్

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని తంతోలి, మామిడిగూడల్లోని రేషన్ షాపులను జిల్లా పౌరసరఫరాల అధికారి టి.కిరణ్ కుమార్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ బాబు సింగ్‌తో కలిసి ఆయా షాపులను సందర్శించి బియ్యం పంపిణీ వివరాలను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పోషక విలువలతో కూడిన బియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కార్డుదారులకు సూచించారు. రేషన్ డీలర్లు సైతం కార్డుదారులు బియ్యం వండుకుని తినేలా అవగాహన కల్పించాలన్నారు.



విజయకేతనం చూపిస్తున్న విద్యార్థులు (ఫైల్)

అమ్మాయిల హవా..!

- ఇంటర్ ఫలితాల్లో వారిదే పైచేయి..
- గతేడాదికంటే తగ్గిన ఉత్తీర్ణత శాతం
- ఫస్టియర్‌లో రాష్ట్రస్థాయిలో 10వ స్థానం
- సెకండియర్‌లో 12వ స్థానం
- గతేడాది కంటే రెండు స్థానాలు వెనక్కి

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మంగళవారం ఇంటర్మీడియెట్ ఫలితాలు విడుదల చేశారు. జిల్లా విద్యార్థులు ఫలితాల పరంగా గతేడాది కంటే ఈ ఏడాది జిల్లా విద్యార్థులు వెనుకబడ్డారు. గతేడాది ప్రథమ సంవత్సరంలో 64 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రస్థాయిలో జిల్లా 9 స్థానంలో నిలవగా, ఈ సారి 10వ స్థానంలో నిలిచింది. గతేడాది ద్వితీయ సంవత్సరంలో ఉత్తీర్ణత శాతం 68 ఉండగా, ఈ ఏడాది కూడా అంతే నమోదైంది. కానీ రాష్ట్రస్థాయిలో గతేడాది జిల్లా 8వ స్థానంలో నిలవగా ఈ సారి 12వ స్థానానికి పడిపోయింది. గతేడాది ఒకేషనల్ ప్రథమ సంవత్సరం విద్యార్థులు రాష్ట్రస్థాయిలో 3వ స్థానంలో నిలవగా, ఈ సారి కూడా ఆ స్థానమే పదిలంగా ఉంది. ద్వితీయ సంవత్సరంలో గతేడాది 2వ స్థానంలో నిలవగా ఈ సారి ఏకంగా 14వ స్థానంలో ఉంది. ఈ ఫలితాల్లో బాలుర కంటే బాలికలదే పైచేయిగా నిలిచింది.

గతం కంటే తగ్గిన ఫలితాలు..

ప్రథమ సంవత్సరంలో...

ఈ ఏడాది ఇంటర్ ఫలితాల్లో విద్యార్థులు నిరాశ పరిచారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 8,927 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 5,490 మంది ఉత్తీర్ణత సాధించారు. 61 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్ర స్థాయిలో 10వ స్థానంలో నిలిచింది. ఇందులో బాలురు 4,505 మంది పరీక్షలు రాయగా 2,358 మంది ఉత్తీర్ణులయ్యారు. 52 శాతం నమోదైంది. బాలికలు 4,422 మంది పరీక్షకు హాజరు కాగా 3,132 మంది ఉత్తీర్ణులయ్యారు. 70 శాతం నమోదైంది. ఒకేషనల్ కోర్సులో 1,095 మంది పరీక్షలు రాయగా 695 మంది పాసయ్యారు. 63 శాతం నమోదైంది. ఇందులో బాలురు 478 మందికిగానూ 255 పాసయ్యారు. 53 శాతం నమోదైంది. బాలికలు 617 మంది పరీక్ష రాయగా 435 మంది ఉత్తీర్ణులయ్యారు. 70 శాతం నమోదైంది.

ద్వితీయ సంవత్సరంలో..

ద్వితీయ సంవత్సరంలో గతేడాది కంటే ఈ సారి నాలుగు స్థానాలు పడిపోయింది. గతేడాది రాష్ట్రస్థాయిలో జిల్లా 8వ స్థానంలో నిలవగా ఈ సారి 12వ స్థానంలో నిలిచింది. 8,442 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 5,808 మంది ఉత్తీర్ణత సాధించారు. 68 శాతంగా నమోదైంది. ఇందులో బాలురు 4,240 మంది పరీక్షలు రాయగా 2,602 మంది పాసయ్యారు. 61 శాతం నమోదైంది. బాలికలు 4,202 మంది పరీక్షకు హాజరు కాగా 3,206 మంది ఉత్తీర్ణులయ్యారు. 76 శాతం నమోదైంది. ఒకేషనల్ కోర్సులో గతేడాది రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలవగా ఈ ఏడాది ఏకంగా 14 వ స్థానానికి పడిపోయింది. మొత్తం 922 మంది పరీక్ష రాయగా 662 మంది పాసయ్యారు. 71 శాతం నమోదైంది. ఇందులో బాలురు 431 మందికిగానూ 268 మంది పాసయ్యారు. 62 శాతం నమోదైంది. బాలికలు 491 మంది పరీక్ష రాయగా 394 మంది ఉత్తీర్ణులయ్యారు. 80 శాతం నమోదైంది.

జూన్ 4 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు

ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 4 నుంచి నిర్వహించనున్నట్లు డీఐఈవో రవీందర్‌కుమార్ తెలిపారు. ఉదయం ప్రథమ సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు జరుగుతాయన్నారు. పరీక్ష ఫీజు ఈ నెల 10 నుంచి మే 16 వరకు చెల్లించాలని సూచించారు. స్కానింగ్ కాపీ కోసం ఆన్‌లైన్‌లో సబ్జెక్టుకు రూ.100, రీకౌంటింగ్‌కు రూ.600 ఆన్‌లైన్‌లో చెల్లించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులెవరూ ఆందోళన చెందవద్దని, ఈ సారి ఎంసెట్‌లో ఇంటర్ మార్కుల వెయిటేజీ తొలగించినట్లు తెలిపారు.

మారుమూల గిరిజన విద్యార్థికి స్టేట్ ర్యాంకు



చౌహాన్ ప్రదీప్‌నాయక్ (467)

సిరికొండ(బోథ్): సిరికొండ మండలంలోని ధర్మసాగర్ గ్రామానికి చెందిన విద్యార్థి చౌహాన్ ప్రదీప్ నాయక్ ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 467 మార్కులు సాధించాడు. గ్రామానికి చెందిన చౌహాన్ మురళీధర్, శీలాబాయి దంపతుల కుమారుడైన ప్రదీప్ నాయక్ హైదరాబాద్‌లోని శ్రీవశిష్ఠ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. కాగా విద్యార్థి స్టేట్ ర్యాంకు సాధించడంతో గ్రామస్తులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'డబుల్' లక్ వరించింది



లబ్ధిదారు పేరును ప్రకటిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

- లక్కీడ్రా ద్వారా లబ్ధిదారుల ఎంపిక
- కలెక్టర్ సమక్షంలో ప్రక్రియ
- 32 వార్డుల్లో 618 మందికి..
- అనర్హులను ఎంపిక చేశారని ఆందోళన

ఆదిలాబాద్‌టౌన్: సొంతింటి కల సాకారం కోసం దరఖాస్తు చేసుకుని కొన్నేళ్లుగా ఎంతో ఆశతో ఎదురుచూస్తున్న డబుల్ బెడ్‌రూం లబ్ధిదారులకు ఎట్టకేలకు లక్ వరించింది. మంగళవారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు కార్యాలయంలో ఆదిలాబాద్ పట్టణంలోని 32 వార్డులకు చెందిన లబ్ధిదారులను కలెక్టర్ రాహుల్‌రాజ్ సమక్షంలో లక్కీడ్రా ద్వారా ఎంపిక చేశారు. మొత్తం 982 మందిని అర్హులుగా గుర్తించగా వార్డులకు సంబంధించి 618 మందిని ఎంపిక చేశారు.

ఎంపిక ఇలా..

ఆదిలాబాద్ పట్టణంలోని 32 వార్డులకు సంబంధించి మొత్తం 7,902 మంది దరఖాస్తు చేసుకోగా 2,538 మందిని అర్హులుగా గుర్తించారు. ఎస్సీ కేటగిరీకి 17 శాతం, మైనార్టీలకు 12 శాతం, ఎస్టీలకు 16 శాతం, దివ్యాంగులకు 5 శాతం రిజర్వేషన్ ప్రకారం ఎంపిక చేశారు. వార్డుల వారీగా కూపన్లను డబ్బాలో ఉంచి చిన్నారుల ద్వారా తీయించారు. ఎంపికై న వారి పేర్లను ప్రకటించారు. మార్కెట్ యార్డులో వీరి జాబితాను ప్రదర్శించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ట్రెయినీ కలెక్టర్ శ్రీజ, ఆదిలాబాద్ ఆర్డీఓ రమేశ్ రాథోడ్, మున్సిపల్ కమిషనర్ శైలజ, ఆదిలాబాద్‌అర్బన్ తహసీల్దార్ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఆందోళన

లక్కీడ్రాలో ఎంపికై న వారు ఆనందోత్సాహాల్లో మునిగితేలగా ఇళ్లు దక్కని వారు నిరాశకు గురయ్యారు. అనర్హులకు దక్కాయని వాపోయారు. కొందరు మహిళలు కలెక్టర్ సమక్షంలో కంటతడి పెట్టారు. ఎలాంటి ఆందోళనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

వార్డుల వారీగా లబ్ధిదారుల వివరాలు

వార్డు నం.	లక్కీడ్రా ద్వారా ఎంపికైనవారు
1	21
2	23
5	19
16	27
18	28
19	31
20	24
21	18
22	22
23	19
24	18
25	16
26	21
27	18
28	20
29	22
30	22
31	14
32	18
33	16
34	21
35	14
36	16
37	14
42	20
43	18
44	18
45	19
46	14
47	15
48	18
49	14
మొత్తం	618

ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాం

డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాం. దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను హైదరాబాద్‌కు చెందిన ఐటీ సెల్ వారు గుర్తించారు. వారు పంపిన నివేదిక ప్రకారం ఎంపిక చేశాం. ఎంపికైన వారిలో అనర్హులు ఉంటే తొలగించి అర్హులకు అందజేస్తాం. వార్డుల వారీగా ఎంపిక చేశాం. త్వరలో ఆదిలాబాద్‌రూరల్, మావల లబ్ధిదారులను ఎంపిక చేస్తాం. – రాహుల్‌రాజ్, కలెక్టర్

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



పల్లకి మోస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న



హనుమంతుడి వేషధారణలో భక్తుడు

- ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్: ఆధ్యాత్మిక భావం మానసిక ప్రశాంతతకు దోహదం చేస్తుందని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని మోచిగల్లీ దక్షిణముఖి హనుమాన్ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం హనుమాన్ పల్లకీసేవ శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత భక్తి భావం అలవర్చుకోవాలన్నారు. ఆధ్యాత్మికతను పెంపొందించుకుంటూ చెడు అలవాట్లను దూరం చేసుకోవాలన్నారు. అప్పుడే మెరుగైన సమాజం రూపుదిద్దుకుంటుందన్నారు. అనంతరం నిర్వహించిన అన్నదానానికి ఎమ్మెల్యే జోగు రామన్న రూ.50 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి శ్రీ యోగానంద సరస్వతి స్వామి, కౌన్సిలర్ బండారి సతీష్, ఆలయ కమిటీ సభ్యులు, హనుమాన్ స్వామి దీక్ష పరులు పాల్గొన్నారు.

చిన్నారులకు వేదాల సారం తెలియజేయాలి

ఆదిలాబాద్: నేటితరం చిన్నారులకు వేదాల్లోని సారాంశాన్ని తెలియజేయాలని హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ యోగా గురువు రమేష్ గురూజీ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో బాల సంస్కార్ శిక్షణ శిబిరంలో భాగంగా తల్లిదండ్రులు, గురువులకు పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. గురూజీ మాట్లాడుతూ నేటితరం పిల్లలు తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలన్నారు. చిన్నారులకు రామాయణం, శ్రవణకుమార చరిత్ర, వినాయకుడి చరిత్ర గురించి తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రామచంద్ర గోపాలకృష్ణ మఠాధిపతి యోగానంద సరస్వతి, శ్రీరామకృష్ణ సేవా సమితి ప్రతినిధులు లస్మయ్య, లెనిన్, హనుమాండ్లు, శ్రీకాంత్, శ్రీధర్, ప్రశాంత్, కోటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న చిన్నారులు

ఫొటోగ్రాఫర్‌కు గోల్డ్‌మెడల్



అనిల్ దేశ్‌పాండే

ఆదిలాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ ఫొటో గ్రాఫర్ అనిల్ దేశ్‌పాండేకు అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం దక్కింది. ఈ ఏడాది జనవరిలో కేరళ రాష్ట్రంలోని పండలం తిరువభరణ యాత్ర సందర్భంగా అనిల్ దేశ్‌పాండే తీసిన చిత్రానికి ఫొటోగ్రాఫిక్ సొసైటీ ఆఫ్ అమెరికా (పీఎస్ఏ) సంస్థ గోల్డ్ మెడల్‌కు ఎంపిక చేసింది.

జేపీఎస్‌ల సమ్మె యథాతథం



శిబిరంలో నినాదాలు చేస్తున్న జేపీఎస్‌లు

కైలాస్‌నగర్: సమ్మె విరమించి మంగళవారం సాయంత్రం ఐదు గంటల్లోగా విధుల్లో చేరాలని, లేని పక్షంలో విధుల నుంచి తొలగిస్తామనే ప్రభుత్వ ఆదేశాలను జూనియర్ పంచాయతీ కార్యదర్శులు లెక్కచేయలేదు. వారికిచ్చిన గడువు ముగిసినప్పటికీ జిల్లాలో ఏ ఒక్క కార్యదర్శి విధుల్లో చేరలేదు. మంగళవారం ఎప్పటిలాగే జిల్లా కేంద్రానికి తరలివచ్చిన జేపీఎస్‌లు కలెక్టరేట్ ఎదుట బైటాయించి యథావిధిగా తమ సమ్మెను కొనసాగించారు. 12వ రోజు సమ్మెలో భాగంగా చెవిలో పూలతో నిరసన తెలిపారు. ప్రభుత్వ బెదిరింపులకు తాము భయపడేదిలేదని, క్రమబద్ధీకరిస్తూ జీవో జారీ చేసేంత వరకు సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు. జేపీఎస్‌ల సమ్మెకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కోఆర్డినేటర్ కుడాల స్వామి, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం నాయకులు మద్దతు తెలిపారు.

బాలల హక్కులను పరిరక్షించాలి

- ట్రెయినీ కలెక్టర్ శ్రీజ



మాట్లాడుతున్న ట్రెయినీ కలెక్టర్ శ్రీజ

తాంసి(బోథ్): బాలల హక్కులను పరిరక్షించాలని ట్రెయినీ కలెక్టర్ శ్రీజ అన్నారు. మంగళవారం మండలంలోని పొన్నారి గ్రామంలో మహిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ ఆడపిల్లల చదువుకు ప్రతిఒక్కరూ ప్రోత్సాహం అందించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఇస్తున్న పోషకాహారాన్ని గర్భిణులు, కిశోర బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీవో రాజేంద్రప్రసాద్, సర్పంచ్ సంజీవ్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రేఖ, ఉప సర్పంచ్ అశోక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుజాత, మహిత మండల కోఆర్డినేటర్ ఇమ్రాన్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య మహిళ' సద్వినియోగం చేసుకోవాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీడీఎంహెచ్‌వో సాధన

బజార్‌హత్నూర్(బోథ్): ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని మండలంలోని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని డెప్యూటీ డీఎంహెచ్‌వో సాధన సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళ క్లినిక్, ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్(పీఎంఎస్ఎంఏ) కార్యక్రమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ఆఫ్ ఏఎన్సీ హైరిస్క్ కేర్, పీఎన్సీ కేర్‌పై శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బజార్ హత్నూర్‌లో ఆరోగ్య మహిళ కేంద్రం ఏర్పాటు చేయడం ఇక్కడి మహిళల అదృష్టమన్నారు. ప్రతీ మంగళవారం మహిళలు ఆరోగ్య పరీక్షలు చేయించుకునేలా గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. మెడికల్ ఆఫీసర్లు భీంరావ్, శిల్ప, అలేఖ్య, హెచ్ఈ రమణారావు, ఎంపీహెచ్ఈవో సూర్యప్రకాష్, ఉల్దా రాణి, సుదాం, సిబ్బంది పాల్గొన్నారు.

'ఎన్నికల హామీలు విస్మరిస్తున్న కేంద్రం'



ప్రజా పోరుయాత్రలో పాల్గొన్న సీపీఐ నాయకులు

తాంసి(బోథ్): ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం విస్మరిస్తూ నయవంచన పాలన సాగిస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి సిర్ర దేవేందర్ ధ్వజమెత్తారు. మంగళవారం మండలంలోని గొట్కూరిలో సీపీఐ ప్రజా పోరుయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు దేవిదాస్ ఆధ్వర్యంలో నాయకులు గ్రామంలోని ఇంటింటా తిరుగుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్న తీరును ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం అచ్చేదిన్ అంటూనే పేదలు, సామాన్య మధ్యతరగతి ప్రజలపై భారం పడేలా ధరలు పెంచుతోందన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు సిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేస్రం భాస్కర్, కేశవ్, గణపతి, ప్రభాకర్, ఎల్లన్న, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గర్భిణులకు మెరుగైన వైద్యసేవలందించాలి



మాట్లాడుతున్న విజయ్‌సారథి

ఉట్నూర్‌రూరల్: గిరిజన ప్రాంత గర్భిణులకు, బాలింతలకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదిలాబాద్ పీవో ఎంసీహెచ్ విజయ్‌సారథి అన్నారు. మంగళవారం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో విజయ్‌కుమార్‌తో కలిసి కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో ఇంద్రవెల్లి, ఉట్నూర్ మండలాలకు చెందిన దంతన్‌పల్లి, శ్యాంపూర్, హస్నాపూర్, పిట్టబొంగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, ఎప్పటికప్పుడు పరీక్షలు నిర్వహిస్తూ ఆరోగ్య రక్షణకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి పలు సలహా సూచనలు అందించారు. సమావేశంలో వైద్యాధికారులు సందీప్, అనురాధ, విజయ, ప్రతాప్‌నాయక్, స్టాఫ్‌నర్స్‌లు, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న టీటీడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో పార్ట్‌టైం గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేయడానికి, యూజీ స్థాయిలో ఆయా సబ్జెక్టుల్లో బోధించేందుకు అర్హత, అనుభవమున్న ఫ్యాకల్టీ నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ హరిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, సెట్/నెట్/పీహెచ్‌డీ కలిగి కనీసం రెండు సంవత్సరాల బోధన అనుభవం కలిగిన ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి వివరాల కోసం www.ttwrdcr.ac.in వెబ్ సైట్‌ను సందర్శించాలని కోరారు. ఈ నెల 16 లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

పరీక్ష ఫలితమే.. జీవితం కాదు



- మార్కులు, ర్యాంకులే కొలమానం కాదు..
- ప్రముఖులెందరో చదువుల్లో పరాజితులే
- కఠిన నిర్ణయాలు సబబు కాదంటున్న మానసిక నిపుణులు

నిర్మల్‌ఖిల్లా: జీవితం అంటే చదువులు, మార్కులు, ర్యాంకులు, ఉన్నత ఉద్యోగాలు మాత్రమే కాదు. ఇవన్నీ విజయానికి కొలమానాలు కానేకాదు. మరి ఎందుకు చదువుకోవాలి.. దాని పరమార్థం ఏమిటి? మన జీవితంలో చదువు, కెరీర్‌ల పాత్ర ఏమిటి? గొప్పగొప్ప వాళ్లంతా పెద్దపెద్ద చదువులు చదివినవాళ్లేనా? ... పలు పరీక్షా ఫలితాల నేపథ్యంలో 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం..

ఒత్తిడే కారణం..
ఇంటర్, పదో తరగతి, నీట్, ఎంసెట్, ఐఐటీ, పోటీ పరీక్షలు ఏవైనా ఫలితాల సమయంలో ఒత్తిడి సహజం. వీటి ప్రభావంతో తీసుకున్న కఠిన నిర్ణయాలైన ఆత్మహత్యలు అప్పుడప్పుడూ తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయి. పదో తరగతి, ఇంటర్ ఇతర ప్రవేశ పరీక్షల్లో ఫెయిల్యూర్‌ను విద్యార్థులు భరించలేకపోవడం దీనికి ముఖ్యకారణం. ఇంటి నుంచే కాకుండా.. సమాజం నుంచి కూడా వచ్చే ఒత్తిడి దీనికి కారణమని మానసిక నిపుణులు అంటున్నారు.

చదువు తెలివితేటల కోసమే..
తల్లిదండ్రులు తిడతారని ఒకరు.. స్నేహితుల వద్ద తలెత్తుకులేమని ఇంకొకరు.. సమాజంలో పరువు పోతుందని మరొకరు.. ఇలా ఏదో కారణంతో విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడుతున్నారు. చదువులో వెనకబడి ఉండి కూడా జీవింతంలో ఊహించని సక్సెస్ అందుకున్న వాళ్లు కోకొల్లలు. డిగ్రీ పట్టా లేకపోయినా వివిధ రంగాల్లో అసమాన్య ప్రతిభ కనబర్చినవారు బోలెడుమంది ఉన్నారు. ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయితే అదేం జీవితంలో ఫెయిల్ అయినట్టు కాదు. విద్యార్థులకు మరో అవకాశం ఉంటుంది. సప్లిమెంటరీలు రాసి మళ్లీ పాస్ కావచ్చు. క్రీడలు, సినిమా, బిజినెస్ లాంటి పలురంగాల్లో అవకాశాలు చాలా ఉన్నాయి. చదువు నిన్ను అవగాహన పరంగా మరో మెట్టు ఎక్కించడానికి మాత్రమే. చదువులో ఫెయిల్ అయితే బతుకులో ఫెయిల్ అయినట్టు కాదు. సరిగ్గా అనుకుంటే చులకనగా చేసిన సమాజం ముందే తలెత్తుకొని జీవించవచ్చు. వివిధ రంగాల్లో ఉన్నతంగా ఎదిగిన అలాంటి వ్యక్తుల ఉదాహరణలు మచ్చుకు కొన్ని....

కమల్‌హాసన్.. సినీనటుడు



నటనలో యావత్ భారతాన్ని ఒక్క ఊపు ఊపిన వారిలో కమల్‌హాసన్ ఒకరు. ఆయన చిన్నప్పుడు స్కూల్ డ్రాప్ అవుట్. పదో తరగతి కూడా చదవలేదు. అయితే నేం నాలుగు దక్షిణ భారత భాషల్లో అనర్గళంగా మాట్లాడటం, రాయటం, చదవడంపై పట్టుసాధించాడు. కమల్‌హాసన్ నటుడు మాత్రమేకాదు రచయిత, డైరెక్టర్, ప్రొడ్యుసర్, ప్లేబ్యాక్ సింగర్.. మల్టీటాలెంటెడ్ స్టార్‌గా ఎదిగాడు.

మహేంద్రసింగ్ ధోని.. క్రికెట్ ఆటగాడు



మనదేశ ప్రఖ్యాత క్రికెటర్లలో ఒకరైన మహేంద్ర సింగ్ ధోనికి తన చిన్నతనంలో చదువు పట్ల పెద్దగా ఆసక్తి ఉండేది కాదు. చిన్నప్పుడు బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్ ఆటలు ఆడేవాడు. ధోనీ గోల్ కీపర్‌గా ఫుట్‌బాల్ ఆడుతున్నప్పుడు, అతడి కోచ్ అతడిని స్థానిక క్రికెట్ క్లబ్‌లో వికెట్ కీపర్‌గా ఆడటానికి ఎంపిక చేశాడు. కాలక్రమేణా క్రికెట్ నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నాడు. దిగువ మధ్యతరగతి కుటుంబానికి చెందిన ధోని కుటుంబాన్ని పోషించుకోవడానికి రైలు టిక్కెట్ ఎగ్జామినర్‌గా పనిచేశాడు. 2004లో భారత క్రికెట్ జట్టుకు ఎంపికయ్యాడు. భారత క్రికెట్ జట్టుకు కెప్టెన్‌గా ఎదిగి ఎన్నో రికార్డులను సాధించాడు.

క్షణికావేశంలో నిర్ణయాలు తీసుకోవద్దు



క్షణికావేశంలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దు. స్థిరంగా ఆలోచించుకోవాలి. మార్కులు, ర్యాంకులు కొలమానం కాదు. చదువుల్లో రాణించని ఎందరో ప్రముఖులు తాము ఎంచుకున్న ప్రత్యామ్నాయ రంగాల్లో ఉన్నతంగా ఎదిగిన వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకోవాలి. మానసికంగా దృఢంగా ఉండేలా విద్యార్థులు, యువతకు తల్లిదండ్రులే మార్గనిర్దేశనం చేయాలి - మోత్కూరి రాంచందర్, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్

ఎంతోమంది..

మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, ఎంటర్‌ప్రెన్యూర్ నారాయణ మూర్తి, అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ, ఎయిర్ డెక్కన్ కెప్టెన్ గోపినాథ్, వరల్డ్ చాంపియన్ సుశీల్ వ్యాపార వేత్త సుభాష్‌చంద్ర గోయెంకా వీరందరి ప్రయాణం ఉన్నత చదువులతో ప్రారంభం అవ్వలేదు. అభిరుచి కలిగిన రంగంలో స్వయంకృషితో ఎన్నో ఒడిదుడుకులు, అవమానాలను ఎదుర్కొని కష్టపడి ఎదిగినవాళ్లు. ఇంటర్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని, పదిలో ఫెయిల్ అయ్యారని తనువు చాలించాలనే నిర్ణయానికి రావడం సబబేనా.. ఓ సారి ఆలోచించండి..



వ్యాపార వేత్త సుభాష్ చంద్ర గోయెంకా

ఆత్మవిశ్వాసం ఉంటే చాలు...



దిలావర్‌పూర్ మండలం లోలం గ్రామానికి చెందిన డాక్టర్ వెల్మల మధు ప్రస్తుతం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. వేలాది మంది పోటీ పడిన డీఎల్ పరీక్షలో ఆయన ఎందర్నో వెనక్కినెట్టి ఉద్యోగం సంపాదించుకున్నారు. ఆయన ఒకప్పుడు ఇంటర్‌లో పరీక్ష తప్పాడు. డిగ్రీలోనూ అంతే ముందుకెళ్లలేకపోయాడు. తనవల్ల కాదని ప్రయివేటులో చిన్నాచితక ఉద్యోగాలు చేస్తూ పోయాడు. కొన్నేళ్ల తర్వాత తనమిత్రులను చూసి స్ఫూర్తిని పొందాడు. ఆగిన చదువును పట్టాలెక్కించి డిగ్రీ నుంచి వృక్షశాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా పొందేదాకా ఎక్కడా వెనుదిరిగి చూడలేదు. ప్రస్తుతం వివిధ అంశాలలో ప్రావీణ్యం సంపాదించి అనేక పరిశోధన పత్రాలను, అంతర్జాతీయ స్థాయిలో సమర్పిస్తూ రాణిస్తున్నారు.

సెల్‌ఫోన్ల రికవరీ

- ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి



సెల్‌ఫోన్లను బాధితులకు అందిస్తున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: సీఈఐఆర్ వెబ్‌సైట్ ద్వారా పోగొట్టుకున్న ఫోన్‌లను రికవరీ చేయడం జరుగుతుందని ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి అన్నారు. జిల్లాలో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న ఐదుగురు బాధితులకు మంగళవారం స్థానిక పోలీసు కార్యాలయంలో ఫోన్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సెల్‌ఫోన్ పోయిన వెంటనే దగ్గరలోని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని, వ్యక్తిగతంగా కూడా అభ్యర్థనను అందించిన వెంటనే తమ మొబైల్ ఫోన్‌లను తిరిగి స్వాధీనం చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన నారాయణ, జై జవాన్ నగర్‌కు చెందిన ఎం. అనిత, మావల పోలీసు స్టేషన్ పరిధిలోని పర్వీజ్ సుల్తానా, రాంనగర్‌కు చెందిన గంగారెడ్డి, తలమడుగు పోలీస్ స్టేషన్ పరిధిలోని సత్యనారాయణలు గతంలో వివిధ కారణాలతో ఫోన్‌లు పోగొట్టుకోగా ఈ వెబ్‌సైట్ ద్వారా వాటిని స్వాధీనం చేసుకుని అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎస్.శ్రీనివాసరావు, బి.రాములు నాయక్, సీఐ ఈ చంద్రమౌళి, సైబర్ సెల్ సిబ్బంది సింగజ్వార్ సంజీవ్ కుమార్, రియాజ్ అహ్మద్ పాల్గొన్నారు.

అప్పులబాధతో ఒకరి ఆత్మహత్య

సారంగపూర్: మండలంలోని ఆలూరు గ్రామానికి చెందిన గొడిసెల వెంకటేష్ (65) అప్పులబాధతో మంగళవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, మృతుడి బంధువుల వివరాల ప్రకారం.. వెంకటేష్ స్థానికంగా బీడీ కంపెనీ నడుపుకుంటూ నిర్మల్‌లో చిన్న టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. టిఫిన్ సెంటర్ నిర్వాహణ, బీడీ కంపెనీ లైసెన్స్ తీసుకోవడానికి సుమారు 4 లక్షల వరకు అప్పులు చేశాడు. దీంతో పాటు అతడి తలలో పెద్ద కణతి ఏర్పడగా వైద్యం కోసం సైతం గ్రామంలో పలువురి వద్ద అప్పులు చేశాడు. వాటిని ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్తాపానికి గురైఇంట్లో ఎవరులేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య ఇందిర, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణాసాగర్‌రెడ్డి తెలిపారు.

కుక్కల దాడిలో గేదెదూడ మృతి

కుంటాల: పిచ్చికుక్కల దాడిలో మండల కేంద్రంలోని నాలకంటి గంగాధర్‌కు చెందిన గేదెదూడ మంగళవారం చనిపోయింది. ఇంటి ముందర కట్టేసి ఉంచిన గేదె దూడపై గుంపులుగా వచ్చిన కుక్కలు దాడిచేసి హతమార్చాయి. గతంలో ఒక గేదె, గొర్రెపిలపై పిచ్చికుక్కలు దాడి చేసినా అధికారులు పట్టించుకోలేదని, ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రాజబాపుకు విన్నవించినా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో బాధిత రైతు ఎంపీడీవో దేవేందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశాడు. విచారణ చేసి శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో వెల్లడించారు.

కారు డ్రైవర్‌పై కేసు నమోదు

ఆదిలాబాద్‌టౌన్: అతివేగంగా కారు నడుపుతూ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన మహారాష్ట్రకు చెందిన కారు డ్రైవర్‌పై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఊశన్న తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని బొక్కల్‌గూడ ఖానాపూర్‌కు చెందిన అల్తాఫ్‌ఖాన్ ఈ నెల 3న తన భార్య, కూతూరుతో కలిసి పట్టణంలోని బసవేశ్వరచౌక్ వద్ద రోడ్డు దాటుతుండగా బస్టాండ్ వైపు నుంచి అతివేగంగా వస్తున్న కారు ఢీకొట్టింది. దీంతో అల్తాఫ్‌ఖాన్‌తో పాటు ఆయన భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లుగా ఆయన పేర్కొన్నారు.

దొంగతనానికి యత్నం.. పట్టుకున్న గ్రామస్తులు



గ్రామస్తులు పట్టుకున్న దొంగ

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటిలో మంగళవారం ఓ వ్యక్తి దొంగతనానికి ప్రయత్నించగా గ్రామస్తులకు దొరికిపోయాడు. స్థానికుల వివరాల ప్రకారం.. మంగళవారం గ్రామంలో ఒంటరిగా అపరిచిత వ్యక్తి తిరుగుతున్నట్లుగా గ్రామస్తులు గుర్తించారు. మధ్యాహ్నం సమయంలో గ్రామంలో ఎవరు లేని ఇంట్లోకి చొరబడి దొంగతనం చేయడానికి యత్నించాడు. అదే సమయంలో ఇంటి సంబంధించిన వారు రావడంతో దొంగను పట్టుకున్నారు. అనంతరం పోలీసులకు అప్పగించారు.

ఎంఆర్‌ఐ స్కానింగ్ ఏర్పాటు చేయాలి

- టీఎస్ఎంఎస్ఐడీసీ జీఎంకు రూపేశ్‌రెడ్డి వినతి



జీఎం రాంబాబు నాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న రూపేశ్‌రెడ్డి

ఆదిలాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలో రూ.150 కోట్లతో నిర్మించిన రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఎంఆర్‌ఐ స్కానింగ్ ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర మెడికల్ సర్వీస్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎస్ఎంఎస్ఐడీసీ) జీ.ఎం. రాంబాబు నాయక్‌ను యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేశ్‌రెడ్డి కోరారు. మంగళవారం హైదరాబాద్‌లో జీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్లాది రూపాయలు వెచ్చించి ఆస్పత్రిని నిర్మించారని, అందులో ఎంఆర్‌ఐ స్కానింగ్ ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. ఈ సౌకర్యం లేకపోవడంతో జిల్లా ప్రజలు రూ.వేలల్లో ఖర్చు చేసి హైదరాబాద్, నిజామాబాద్, మహారాష్ట్ర, తదితర ప్రాంతాలకు స్కానింగ్ కోసం వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభించి నెలలు గడుస్తున్నా.. ఇంత వరకు ఎంఆర్‌ఐ స్కానింగ్ లేదన్నారు. ఇప్పటికైనా స్కానింగ్ ఏర్పాటు చేసి ప్రజల కష్టాలు దూరం చేయాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన జీఎం త్వరలో స్కానింగ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

ఇంటర్ ఫలితాల్లో గురుకులాల హవా

- ఫస్టియర్‌లో 2వ, సెకండియర్‌లో 4, 5వ ర్యాంక్‌లు
- విద్యార్థినులను అభినందించిన ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డి



టి.వర్షిత



సీహెచ్ సుధారాణి

ఉట్నూర్‌రూరల్: తెలంగాణ గిరిజన గురుకులాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీనియర్ ఇంటర్ ఫలితాల్లో ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని 13కళాశాలల్లో 95.27శాతం, మొదటి సంవత్సరంలో 85.12శాతం ఫలితాలు సాధించినట్లు ఆర్సీవో గంగాధర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటర్ సెకండ్ ఇయర్ సీఈసీలో టి.వర్షిత (ఉట్నూర్ కళాశాల) 946 మార్కులు, సీహెచ్ సుధారాణి (ఆసిఫాబాద్ కళాశాల) 945 మార్కులతో రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన గురుకులాల్లో 4వ, 5వ ర్యాంక్‌ను సాధించినట్లు తెలిపారు. అలాగే ఆసిఫాబాద్ గురుకులానికి చెందిన ఆర్.కార్తీక 458 మార్కులతో బైపీసీలో రాష్ట్రంలోనే 2వ ర్యాంక్‌ను సాధించినట్లు తెలిపాడు. సెకండ్ ఇయర్ ఫలితాల్లో ఇంద్రవెల్లి, తిర్యాణి, ఆసిఫాబాద్, జైనూర్ బాలికల జూనియర్ కళాశాల 100శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. ఇంటర్ సెకండ్ ఇయర్‌లో 1117 మందికి 1068 మంది ఉత్తీర్ణత సాధించగా 49 మంది ఫెయిలైనట్లు తెలిపాడు. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో 1279 మందికి 1104 మంది ఉత్తీర్ణులు కాగా 175 మంది అనుత్తీర్ణులైనట్లు పేర్కొన్నాడు. సెకండ్ ఇయర్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 4, 5వ ర్యాంక్ సాధించిన వర్షిత, సీహెచ్ సుధారాణి, 2వ ర్యాంకు సాధించిన ఆర్.కార్తీకను ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డి, ఆర్సీవో వి.గంగాధర్ అభినందించారు.

చెన్నై జాతీయ సమైక్య శిబిరానికి ఎంపిక



సాయినాథ్



శివమణి

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ కెడేట్స్ మాడవి శివమణి, భాస్కరోల్ల సాయినాథ్ చెన్నైలో జరిగే పది రోజుల ఏక్ భారత్ శ్రేష్ట భారత్ శిబిరానికి ఎంపికై నట్లు కళాశాల ఎన్‌సీసీ అధికారి, ప్రిన్సిపాల్ డాక్టర్ భీమరావు తెలిపారు. ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు జరిగే ఈ జాతీయ సమైక్య శిబిరానికి వీరిద్దరూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ఎన్‌సీసీ కెడేట్స్ తమ రాష్ట్రాలకు సంబంధించిన సంస్కృతి సంప్రదాయాలను ఇతరులకు వివరిస్తారని, అక్కడి సంస్కృతి సంప్రదాయాలను నేర్చుకుంటారని వివరించారు. బోథ్ మండలంలోని మారుమూల గ్రామమైన కంటేగాం గ్రామానికి చెందిన మాడవి శివమణి, ముథోల్ ప్రాంతానికి చెందిన సాయినాథ్ ప్రస్తుతం బీజెడ్‌సి రెండో సంవత్సరం చదువుతున్నారు.

ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కరించాలి

దస్తురాబాద్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని నిర్మల్ ఆర్డీవో స్రవంతి అన్నారు. మంగళవారం దస్తురాబాద్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీవో సందర్శించి మాట్లాడారు. ధరణిలో భూముల రిజిస్ట్రేషన్ రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం మంజూరైన నూతన పెట్రోల్‌బంక్ స్థలాన్ని పరిశీలించారు. వారి వెంట తహసీల్దార్ లక్ష్మి, ఆర్ఐలు గంగన్న, వెంకటనర్సయ్య, తదితరులు ఉన్నారు.